క్లుప్తంగా

చవితికి మట్టి గణపతిని ప్రతిష్ఠించాలి



భోగి గణపతి పీఠంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా ప్రతీ ఇంటిలోను నవరాత్రి ఉత్సవాలకు మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని రక్షించాలని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శ్రావణ హేరంభ సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం సూర్యారావుపేటలోని భోగిగణపతి పీఠంలో సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఉపవాస ఆరాధనతో ఆరోగ్య ఆధ్యాత్మిక సంపద కలుగుతుందన్నారు. అనంతరం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం సమరభేరి డిమాండ్ చేసింది. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సీపీఎం నిర్వహిస్తున్న సమరభేరిలో భాగంగా ఆదివారం సుందరయ్యభవన్‌లో నిరుద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి రూ. 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినా యువశక్తి సక్రమంగా ఉపయోగించడం లేదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, కె దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు సాయం అభినందనీయం



రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌ను ప్రారంభిస్తున్న ప్రవీణ్‌చక్రవర్తి

బోట్‌క్లబ్: ఐదేళ్లుగా ఎందరో సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని కేటీసీ విద్యాసంస్థల చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని హోప్ ఫర్ చేంజ్ సంస్థ ఐదో వార్షికోత్సవం సంస్థ అధ్యక్షుడు లక్ష్మీ నాగేంద్ర అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఐదేళ్లుగా ఎందరో నిరుపేదలకు ఆసరాగా నిలిచి ప్రస్తుతం రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్ ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ వెంకట్ మాట్లాడుతూ సమాజంలో ఎందరో నిరుపేదలు ఆసరా కోసం ఎదురుచూస్తున్నారని వారిని చేరతీసి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. నాగేంద్ర సేవలు కొనియాడదగినవన్నారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ గవర్నర్ వరలక్ష్మి, మాజీ గవర్నర్లు మాటూరి శిరీష, కొవ్వూరి మునిరెడ్డి, అలయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ వనుమ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్టు

కొత్తపల్లి: ఆలయాల్లో చోరీకి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ద్వారం రవిప్రసాద్ మండలంలోని శ్రీరాంపురం కనకదుర్గాదేవి ఆలయంలో మార్చి నెలలో చోరీకి పాల్పడ్డాడు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలో రవికుమార్ కిర్లంపూడి, గొల్లప్రోలు, ప్రతిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగలు, ఆయిల్ దొంగలించడంపై ఏడు కేసులు నమోదయ్యాయి. గొల్లప్రోలు, ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో కూడా చోరీకి పాల్పడ్డాడు. కాగా ఆదివారం ప్రత్తిపాడు వై జంక్షన్ వద్ద రవిప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.లక్ష విలువ చేసే రాగి తీగలు, ఆయిల్‌తో పాటు పలు ఆలయాల్లో దొంగిలించిన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జోరుగా ఓటర్ల జాబితాల పరిశీలన

తాళ్లరేవు: ఓటర్ల జాబితాల పరిశీలన జోరుగా సాగుతోంది. బీఎల్‌ఓలు సెలవు రోజైన ఆదివారం కూడా జాబితాల పరిశీలనలో పాల్గొన్నారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను కూలంకషంగా పరిశీలిస్తున్నారు.

చెట్టును ఢీకొన్న ప్రైవేటు బస్సు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఒక ప్రైవేటు బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పి.గన్నవరం నుంచి అన్నవరం పెళ్లికి వెళ్లిన బృందం తిరిగి వస్తుండగా కోరంగి పోలీస్‌స్టేషన్ సమీపంలో బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. బస్సు చెట్టును ఢీకొని ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టైంది. కోరంగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మువ్వలు మురిసేలా..

- నాట్యంలో రాణిస్తున్న విద్యార్థులు
- చదువుతో సమానంగా కళాసాధన
- నాట్యభారతి పురస్కారాల స్వీకరణ



నాట్యభారతి పురస్కారాలు స్వీకరిస్తున్న విద్యార్థులు

కాకినాడ కల్చరల్: విద్యార్థినులు కేవలం చదువుకే పరిమితం కాకుండా నృత్యం, సంగీతం తదితర కళల్లో కూడా రాణిస్తున్నారు. చదువుకు కళలు అటకం కాదని నిరూపిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇచ్చి తమ సత్తా చాటుతున్నారు. కళల్లో శిక్షణ పొందడం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతుందని విద్యార్థులు చెప్తున్నారు. దీనికి తోడు తల్లిదండ్రులు కూడా పిల్లల ఇష్టాలకు ప్రాధాన్యం ఇస్తూ వారి ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో ప్రస్తుతం కళలకు ఆదరణ బాగా పెరిగిందని చెప్పాలి. ఇటీవల సిక్రిందాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన భారతీయ కళా నృత్యోత్సవంలో శ్రీజనని నృత్యనికేతన్ విద్యార్థినులు పాల్గొని చక్కని హావభావాలతో ప్రతిభ కనబరచి నాట్యభారతి పురస్కారాలు స్వీకరించారు. వారి అంతరంగం వారి మాటల్లోనే..

చదువుకు ఆటంకం కాదు



నాపేరు జి.లక్ష్మి అపూర్వ. నాట్యభారతి పురస్కారం పొందడం చాలా ఆనందంగా ఉంది. నేను నాలుగేళ్లుగా నాట్యం నేర్చుకొంటున్నారు. శాస్త్రీయ నృత్యం అంటే ప్రాణం. నృత్యంలో మరిన్ని మెళకువలు నేర్చుకుని అంతర్జాతీయ వేదికపై నృత్య ప్రదర్శన చేయాలనేదే నా కోరిక. చదువుకు కళల అభ్యసన ఆటంకం కాదు. మరింత ఏకాగ్రత పెరుగుతోంది. చాలా నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. – జి.లక్ష్మి అపూర్వ

ఏకాగ్రత పెరుగుతోంది



నాపేరు పి.సమీర. నాట్యభారతి అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. నేను ఐదో తరగతి చదువుతున్నాను. మా నాన్న ఆటో నడుపుతారు. నృత్యం నేర్చుకోవడం వలన ఏకగ్రాత, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతాయి. ఇప్పటి వరకు 25 నృత్య ప్రదర్శనలు ఇచ్చాను. మంచి నర్తకిగా రాణించాలనేదే నా ఆశయం. – పి.సమీర

నృత్యం అంటే చాలా ఇష్టం



నా పేరు జి.పూజిత. నాట్య భారతి అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. 4వ తరగతి చదువుతున్నాను. ఐదో సంవత్సరం నుంచి నాట్యం నేర్చుకొంటున్నాను. చిన్న వయస్సులో అవార్డు పొందండం ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రులు మంచి సహకారం అందిస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై నృత్యప్రదర్శన చేసి మెప్పించాలనే ఆశయంతో నృత్యం నేర్చుకొంటున్నాను. – జి.పూజిత

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



ప్రతిభ గల పేద విద్యార్థినులను ప్రోత్సహించేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. ప్రతిభ కలిగి, పేదరికం వల్ల కళలకు దూరమవుతున్న విద్యార్థినులను గుర్తించి వారికి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. నేను కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తూ పేద విద్యార్థినులకు నాట్యం నేర్పిస్తున్నాను. వీరిని నర్తకీమణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నృత్యం నేర్పించి కళలను కాపాడేందుకు చిరుప్రయత్నం చేస్తున్నాను. – పి.రమాదేవి, నాట్యాచారిణి, కాకినాడ

ఎమ్మెల్యే కన్నబాబును కలసిన ఆశ



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆశ

కాకినాడరూరల్: కాకినాడ రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు నాగులాపల్లి ఆశ మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జోనల్, అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించిన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతానికి చెందిన నాగులాపల్లి ఆశ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. కాకినాడ వచ్చిన సందర్భంగా ఆమె ఎమ్మెల్యే కన్నబాబును కలిశారు. ఇప్పటి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసేందుకు, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేయాలని ఎమ్మెల్యే కన్నబాబు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

- అనంతరం యథావిధిగా స్పందన



కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884–2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అలరించిన నృత్య నీరాజనం

- సమాఖ్య సేవలు ఆదర్శనీయం
- అనెం పురస్కారాల ప్రదానం



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

కాకినాడ కల్చరల్: శాస్త్రీయ నృత్య కళాకారుల సమాఖ్య సేవలు ఆదర్శనీయమని సంఘ సేవకుడు, ప్రముఖ ఇంజినీర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో శాస్త్రీయ నృత్య కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం స్వర్గీయ నాట్యాచార్య అనెం లక్ష్మణరావుకు నివాళిగా 12 గంటల పాటు నృత్యనీరాజనం పేరుతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. ముందుగా అనెం లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థుల నృత్య రూపకాలు ఆకట్టుకొన్నారు. అనంతరం నాట్యాచార్య ఓపీఎస్ వరప్రసాద్‌కు, అఖిల భారత తెలుగు సేన అధ్యక్షుడు పీఎస్ఎన్‌కు, మేకప్ ఆర్టిస్టులు అళపు రాము, ఆళపు లక్ష్మిలకు ఆనెం లక్ష్మణరావు స్మారక జీవితకాల పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య కార్యదర్శి అనెం ప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ అనెం లక్ష్మణరావు ఆశయ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు సమాఖ్య కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్య కృష్ణకుమార్, వరప్రసాద్, లోకేష్, ఎస్‌కేవీడీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించాలి

- ఆర్డీఓ సత్యనారాయణ



సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనపై సమీక్షిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కరప: ఓటర్ల ఇంటింటి సర్వే పూర్తయిన తర్వాత సమగ్ర ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బీఎల్‌ఓలు, వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సమీక్షించి పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా ప్రకారం ఇంటింట సర్వే పూర్తయిందని, సర్వేను అనుసరించి క్షేత్రస్థాయిలో అందుబాటులోని ఓటర్లకు ఫారమ్–బి నోటీసు ద్వారా రిజిస్టర్ పోస్టు ద్వారా సమాచారం పంపించాలన్నారు. మరణించిన వారు, గ్రామాంతరం వెళ్లిన, మార్పులు, చేర్పులు, తొలగింపుల ఓటర్ల వివరాలను రోజువారీ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించాలని ఆర్డీఓ సత్యనారాయణ ఆదేశించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

జోడుగుళ్ల అభివృద్ధికి కృషి



జోడుగుళ్ల ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: మండలంలోని చారిత్రాత్మకమైన కట్టమూరు కేశవ పట్టాభిరామస్వామి (జోడుగుళ్లు) ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. సుమారు రూ.కోటితో చేపట్టే ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపనకు వారు వేర్వేరుగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్ మేడిద వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ పునర్నిర్మాణ పనులు మరింత వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు భక్తులు, దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆలయ అభివృద్ధికి కావలసిన సహాయ, సహకారాలు ఎప్పుడూ అందిస్తానని దొరబాబు హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నల్లల గోవిందు, సొసైటీ అధ్యక్షుడు చల్లా చిన వీర్రాజు, ఎంపీటీసీ నల్లల సూర్యకుమారి, బిక్కిన శేషకుమారి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు, ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, ఆలయ అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులు, ఆలయ పర్యవేక్షకులు ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్బీ పట్నంలో దొరబాబు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: మండలంలోని రాయభూపాలపట్నం గ్రామ వినాయక ఆలయంలో ఆదివారం దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తదితరులతో కలసి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని దొరబాబు హామీ ఇచ్చారు.

ఆర్తులను ఆదుకోవడమే మానవత్వం

- శ్రీయువసేన సేవలు ప్రశంసనీయం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి

కాకినాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలన్న మంచి ఆలోచన మనుషుల్లోని మానవీయతకు నిదర్శనంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఇటువంటి ఆలోచన విధానంతో ముందుకు వెళుతున్న శ్రీ యువసేన రాష్ట్రంలోనే ఎన్నో సేవా సంస్థలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కోవిడ్‌తో పాటు వివిధ ప్రమాదాల్లో కుటుంబ యజమానిని కోల్పోయిన సుమారు 50 మంది పిల్లలకు దాతల సహకారంతో ఈ సంస్థ విద్యను అందిస్తోంది. ఈ ఏడాది దాతల ద్వారా సుమారు రూ.13 లక్షలు కార్పొరేట్ పాఠశాలలకు ఫీజులు కట్టిన నేపథ్యంలో స్థానిక డి కన్వెన్షన్‌లో ఆదివారం దాతలు, విద్యార్థులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వీరందరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన ఒక స్నేహితుడి జ్ఞాపకార్థం పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన శ్రీ యువసేన ఎంతోమంది కష్టాల్లో ఉన్న పేద వర్గాలకు తోడుగా నిలుస్తోందని ప్రశంసించారు. ముఖ్యంగా పిల్లలను విద్య పరంగా ప్రోత్సహించి, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే బాధ్యత తీసుకోవడం మరింత శుభపరిణామమన్నారు. ఈ సంస్థ ద్వారా ఎంతో మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూడా తోడ్పాటు అందించానని ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. శ్రీ యువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్‌కు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ సేవా భావంతో పనిచేసే సంస్థలను ప్రోత్సహిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి మాట్లాడుతూ సీఎస్సార్ నిధుల ద్వారా గతంలోనే రూ.5 లక్షలు శ్రీ యువసేనకు అందించానని, భవిష్యత్తులో కూడా సహకారాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలందరికీ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో దాతలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

87వ సారి రక్తదానం చేసిన తాతీలు

కరప: గ్రామ మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆదివారం 87వ సారి రక్తదానం చేశారు. మూడు నెలలకు ఒకొకసారి ఆయన కాకినాడ ప్రభుత్వా సుపత్రికి వెళ్లి రక్తదానం చేస్తుంటారు. డాక్టర్ లహరి హరిబాబు, టెక్నీషియన్ కె.హరిబాబు తాతీలునుంచి రక్తాన్ని సేకరించారు.



రక్తదానం చేస్తున్న తాతీలు

ఘనంగా గురుపూజోత్సవం



గురువులను సత్కరిస్తున్న లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో గురు పూజోత్సవం నిర్వహించారు. క్లబ్ మాజీ గవర్నర్లు బాదం బాలకృష్ణ, ముంజులూరి విశ్వేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ శిష్యులు అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందాలన్న ఆకాంక్ష గురువుల్లో ఉంటుందని, వారు చిరస్మరణీయులని బాలకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కేఎస్ఎస్ ప్రసాద్, కేవీవీ సత్యనారాయణ, ఎం.నాగర్జున, టి.సాయి రామకృష్ణ, టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, పి.రవిశంకర్, తాడి శ్రీనివాసరెడ్డి, కేసరి శ్రీనివాసరావు, పిల్లి గోవిందరాజులు, ఆర్‌పి ఆర్.విఠల్, నందూరి కామేశ్వరరావును సత్కరించి జ్ఞాపిక అందించారు. లయన్స్ ఎలైట్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి బులుసు కిశోర్‌కుమార్, రీజియన్ చైర్మపర్సన్లు ఎం.వెంకటరమణ, కటకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగరతీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఫ్యాకల్టీని సత్కరించిన పంచాయతీ కార్యదర్శులు



పంచాయతీ కార్యదర్శులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని గ్రేడ్–1, గ్రేడ్ 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించే రెసిడెన్షియల్ ముగింపు శిక్షణలో విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ. జె.వేణుగోపాల్ పాల్గొన్నారు. గ్రామాల్లో కొత్తగా లే అవుట్ల ఏర్పాటులో అమలులో ఉన్న నిబంధనలపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లే అవుట్ ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణపై కార్యదర్శుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఫ్యాకల్టీలు బి.ఆంజనేయులు, ఎస్‌కె మొహిద్దీన్, శ్రీదేవి నిహారిక పాల్గొన్నారు. తమకు తెలియని అనేక విషయాలను తెలియజేశారని పంచాయతీ కార్యదర్శులు ఈటీసీ ఫ్యాకల్టీలను సత్కరించారు.